## క్లుప్తంగా

### కార్మికులకు ఉచిత వైద్య శిబిరం


రోగులకు మందులు పంపిణీ చేస్తున్న శిద్దా వెంకటేశ్వరరావు

**చీమకుర్తి:** కృష్ణసాయి, మణికంఠ గ్రానైట్ క్వారీల ప్రాంగణంలో పనిచేసే కార్మికులకు క్వారీ యజమాని శిద్దా వెంకటేశ్వరరావు పుట్టినరోజు సందర్భంగా ఆదివారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. దాంతో పాటు రక్తదాన శిబిరాన్ని కూడా నిర్వహించారు. క్వారీలో పనిచేసే వారిలో 30 మంది రక్తదానం చేశారు. కార్మికులకు బోనస్ అందించారు. కార్మికులతో పాటు స్థానిక రోడ్డు ప్రయాణికుల కోసం సురక్షితమైన తాగునీటి మినరల్ వాటర్‌తో కూడిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. తొలుత శిద్దా వెంకటేశ్వరరావు చేతుల మీదుగా కేకు కట్ చేశారు. ఆయన కుమారుడు భరత్‌తో పాటు క్వారీ జీఎంలు, మేనేజర్లు పుష్పగుచ్ఛాలు అందించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

### ఈదుమూడిలో ఉచిత వైద్య శిబిరం


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

**నాగులుప్పలపాడు:** మండలంలోని ఈదుమూడి గ్రామంలో ఆదివారం ఆరోగ్య శ్రీ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మనం, మన ఊరు, మన ఈదుమూడి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో వైద్యులు మౌనికారెడ్డి, కె.వెంకటేష్, సరయు, పల్లవ వైద్య సేవలు అందజేశారు. సుమారు 140 మందికి కంటి, దంత సమస్యలకు పరీక్షలు చేశారు. ఈసీజీ, సుగర్, బీపీ, గుండె సంబంధిత వ్యాధులకు కూడా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు కాపూరి వాసు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈదుమూడి గ్రామాన్ని దత్తత తీసుకుని ప్రతినెలా ఉచితంగా వైద్యసేవలు అందించేందుకు ముందుకొచ్చిన శ్రీరాం సూపర్ స్పెషాలిటీ వైద్యశాల నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా గ్రామం నుంచి ఉప్పుగుండూరు రహదారికి ఇరువైపులా మొక్కలు నాటారు.

### పోలీసుల పల్లె నిద్ర


పోలీసు పల్లె నిద్రలో సీఐ సోమయ్య

**గిద్దలూరు రూరల్:** ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు పల్లె నిద్ర చేయాలని పోలీసు ఉన్నతాధికారులు నిర్ణయించారు. అందులో భాగంగా సీఐ వైవీ సోమయ్య మండలంలోని పాదలకుంటపల్లె గ్రామంలో ఆదివారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో ఇరు పార్టీల వారు ఎటువంటి అల్లర్లకు పాల్పడకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పోలీసు బలగాలను పల్లెల్లో ఉండేలా ఈ కార్యక్రమం ప్రారంభించారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం అల్లర్లకు పాల్పడి, కేసుల్లో చిక్కుకుని జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు.

# వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణం


మాంగల్య ధారణ క్రతువులో అర్చక స్వామి


గోవిందమాంబ వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణంలో పాల్గొన్న భక్తులు

**ఒంగోలు మెట్రో:** స్థానిక మంగమూరు రోడ్డులోని శ్రీశ్రీశ్రీ యోగి అచలానందస్వామి మందిరంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాల సందర్భంగా చివరి రోజు గోవిందమాంబ, వీరబ్రహ్మేంద్రుల కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అచలానంద ఆశ్రమం నిర్వాహకుడు పరిపూర్ణ సిద్ధానందస్వామి నిర్వహణలో ఉదయం పది గంటలకు ఋత్వికులు గోనుగుంట నాగేశ్వరశర్మ ఆధ్వర్యంలో గోవిందమాంబ, వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రత్యేక పూజలు, మాంగల్య పూజ, మాంగల్య ధారణ క్రతువును శాస్త్రోక్తంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పరిపూర్ణ సిద్ధానంద స్వామి మాట్లాడుతూ లోక కళ్యాణం కోసం జన్మించిన వీరబ్రహ్మేంద్రస్వామి తన కాలజ్ఞానం ద్వారా అనేక విషయాలను ప్రపంచానికి తెలియజేశారని తెలిపారు.

స్వామి కళ్యాణం కూడా లోక కళ్యాణం కోసం అని భక్తులకు వివరించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవార్ల కళ్యాణాన్ని తిలకించి అన్నప్రసాద వితరణలో పాలుపంచుకున్నారు.

# పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఆదర్శనీయం


సుందరయ్య భవనంలో పుచ్చలపల్లి సుందరయ్యకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు


చీమకుర్తిలో నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

**ఒంగోలు టౌన్:** భారతదేశ పార్లమెంటులో తొలి ప్రతిపక్ష నేతగా నిర్మాణాత్మకంగా వ్యవహరించి దేశాభివృద్ధికి పునాదులు వేసిన నిఖార్సయిన ప్రజానేత పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఆదర్శనీయమని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జాలా అంజయ్య కొనియాడారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష నేతగా సైకిల్ మీద పార్లమెంటుకు వెళ్లిన నిరాడంబరుడైన సుందరయ్య లాంటి నాయకుడు దేశ చరిత్రలో మరెవరూ లేరని చెప్పారు. ఏదైనా సమస్య మీద పార్లమెంటులో పుచ్చలపల్లి మాట్లాడుతుంటే మొత్తం సభ నిశబ్దంగా వినడమే కాకుండా నోట్ చేసుకునేవారని అన్నారు. ప్రజా సమస్యలపై సంపూర్ణ అవగాహన కలిగిన ఆయన లాంటి నాయకులు లేకపోవడం నేడు దేశం అనుభవిస్తున్న కష్టాలకు కారణంగా పేర్కొన్నారు. పార్టీ వెలుపల, లోపల ఉన్న అవలక్షణాలపై ఆయన అలుపెరుగని పోరాటం చేశారని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటంలో సుందరయ్య కీలకపాత్ర పోషించారని, ప్రజల కోసం పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకుని జీవితాన్ని త్యాగం చేశారని సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ తెలిపారు. సుందరయ్య స్ఫూర్తితో పార్టీని పునర్నిర్మించుకునేందుకు ప్రతిఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కె.రమాదేవి, జ్యోతి, కల్పన, షమ్మి, చీకటి శ్రీనివాసరావు, రఘురాం, తిరుపతిరావు, రమేష్, సువర్ణరాజు, నరసింహరావు, వెంకటరావు, కె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

**వీధివీధినా వర్ధంతి సభలు...**

పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని నగరంలోని వీధివీధినా నిర్వహించారు. నగరంలోని దిబ్బలరోడ్డు, బైపాస్ రోడ్డు, గాంధీనగర్ సెంటర్, భగత్‌సింగ్ నగర్, బండ్లమిట్ట సెంటర్, కొప్పోలు, త్రోవగుంట, ఎఫ్‌సీ గోడౌన్ సెంటర్లలో ఎర్రజెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జీవీ కొండారెడ్డి మాట్లాడుతూ దోపిడీ పాలకులకు వ్యతిరేకంగా జరిగిన అనేక ఉద్యమాలను సుందరయ్య పోషించారని, తెలంగాణ పోరాటానికి నాయకత్వం వహించారని తెలిపారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం పోరాటాలు చేశారని, ఎన్నికల సంస్కరణల కోసం పార్లమెంటులో గళమెత్తారని తెలిపారు. రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడానికి సుందరయ్య స్ఫూరితో పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, దామా శ్రీనివాసులు, ముసలారెడ్డి, పీర్ సాహెబ్, హనుమంతరావు, పేతూరు, భావనారాయణ, సుబ్బారెడ్డి, యాసిన్, హరికృష్ణ, తంబి శ్రీనివాసులు, ఎన్.రంగారావు, ఏవీ పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

**చీమకుర్తిలో...**

**చీమకుర్తి:** సీపీఎం నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని చీమకుర్తిలోని సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి పూసపాటి వెంకట్రావు, పల్లాపల్లి ఆంజనేయులు, ఓబుల్‌రెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

**కేవీ పాలెంలో సేవా కార్యక్రమాలు...**

పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకొని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు ఆధ్వర్యంలో కూనంనేనివారిపాలెంలో నివాళులర్పించారు. అనంతరం రోడ్లు మీద శుభ్రం చేసి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పొత్తూరి సురేష్, స్థానికులు పాల్గొన్నారు.

# చేజర్లమ్మకు జేజేలు

- వైభవంగా చేజర్ల అమ్మవారి తిరునాళ్లు

**ఒంగోలు రూరల్:** మండలంలోని చేజర్ల గ్రామంలో వేంచేసియున్న చేజర్ల అమ్మవారి ఆలయ తిరునాళ్లను ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. కొత్తపట్నం మండలం, ఒంగోలు నగరం, ఒంగోలు రూరల్ మండలంలోని గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. తొలుత భక్తులు అమ్మవారికి పొంగళ్లు సమర్పించారు. పశుపోషకులు మొదటిగా పుట్టిన పశువును అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం పూజాపండితులు శాస్త్రోక్తంగా వేదమంత్రాలు పటిస్తూ పూజలు చేశారు. మహిళలు, పురుషులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కానుకలు సమర్పించారు. అనంతరం భారీగా తిరునాళ్లలో పాల్గొన్న భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ప్రతి ఏటా వచ్చే 5 భారీ ప్రభలు ఈ సంవత్సరం రాకపోవడంతో భక్తులు కొంత నిరుత్సాహానికి గురయ్యారు. పలు స్వచ్ఛంద సంస్థలు మజ్జిగ, మంచినీటిని భక్తులకు అందజేశాయి. ఒంగోలు తాలూకా ఎస్సైలు, మహిళా కానిస్టేబుళ్లు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక కార్యదర్శి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పర్యవేక్షించారు.


పూజలందుకుంటున్న చేజర్ల అమ్మవారు


చేజర్ల అమ్మవారికి పొంగళ్లు పెడుతున్న భక్తులు


అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

# భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతాలు


సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న దంపతులు

**ఒంగోలు మెట్రో:** వైశాఖమాసం అంటేనే విష్ణుమూర్తికి ఇష్టమైన మాసం. విష్ణువు తన స్త్రీ అవతారమైన మోహినీ రూపాన్ని ధరించిన రోజును పురస్కరించుకుని మోహినీ ఏకాదశిని హిందువులు జరుపుకుంటారు. అలాంటి వైశాఖ మాసం శుక్ల పక్ష ఏకాదశి ఆదివారం సందర్భంగా నగరంలోని పలు వైష్ణవాలయాల్లో శ్రీ రమా వసుంధర సమేత శ్రీ సత్యనారాయణస్వామి వ్రతాన్ని ఆలయ నిర్వాహకుల పర్యవేక్షణలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక కేశవస్వామిపేటలోని ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానంలో అర్చకస్వామి శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహికంగా వ్రతాలలో 50 మంది దంపతులు పాల్గొన్నారు. పూజా క్రతువులో భాగంగా ఉదయం ఎనిమిది గంటలకు గణపతి పూజ, మండపారాధన, కలశ పూజ, అభిషేకం నిర్వహించారు. అనంతరం అర్చక స్వామి శ్రీ రమా వసుంధర సమేత శ్రీ సత్యనారాయణస్వామి అష్టోత్తర పూజ నిర్వహించి సత్యనారాయణస్వామి కథను భక్తులకు చక్కగా అర్థమయ్యే రీతిలో వివరించారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ వసుంధర సమేత సత్యనారాయణస్వామి వ్రతాన్ని తిలకించి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# జేఈఈ మెయిన్స్‌లో శ్రీ సరస్వతి విద్యార్థుల సత్తా


ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న శ్రీప్రతిభ విద్యాసంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు

**ఒంగోలు:** జేఈఈ మెయిన్స్ (పేపర్-2)లో తమ విద్యార్థులు సత్తాచాటారని శ్రీ సరస్వతి విద్యాసంస్థల చైర్మన్ ఏవీ రమణారెడ్డి తెలిపారు. 99.65 పర్సంటైల్‌తో జాతీయ స్థాయి 15వ ర్యాంకు సాధించారన్నారు. కె.సాకేత్ సాయిరాం 99.65 పర్సంటైల్, కె.గోపీచంద్ 99.59, కె.సాయికిరణ్ 99.20 పర్సంటైల్ సాధించారన్నారు. గణితంలో వందకు వంద పర్సంటైల్ సాధించారని పేర్కొన్నారు. జి.వెంకట పవన్‌కుమార్ జాతీయ స్థాయిలో 15, కె.సాకేత్ సాయిరాం 17, బి.శివనాగరాజు 55, ఎస్.ఇంద్రసేనారెడ్డి 66వ ర్యాంకులు సాధించారు. వెయ్యిలోపు 18 మంది, 5 వేలలోపు 172 మంది, 10 వేలలోపు 218 మంది ర్యాంకులు సాధించారని డైరెక్టర్లు ఎ.గణేష్‌రెడ్డి, ఎ.గంగా శంకరరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులను సీఈవో ఎస్‌వీ సురేష్, ప్రిన్సిపాళ్లు, డీన్లు అభినందించారు.

**శ్రీప్రతిభ విద్యార్థికి జాతీయ స్థాయి 14వ ర్యాంకు...**

తమ విద్యార్థికి జేఈఈ మెయిన్స్ పేపర్-2లో జాతీయ స్థాయి 14వ ర్యాంకు లభించిందని శ్రీప్రతిభ విద్యాసంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు తెలిపారు. ఘట్టమనేని మోహిత సాయి-37, కండ్లగుంట పూజ 56, తోట వెంకట అవినాష్‌నాయుడు 70, పుట్లూరి గోపవర్ధన్ 71, దారం శ్రీవర్ధన్‌రెడ్డి 81, ఉండేల శివనాగేంద్రరెడ్డి 82 ర్యాంకు సాధించారు. ఇంకా 500లోపు 23, వెయ్యిలోపు 50, 2 వేలలోపు 119 మంది, 3 వేల లోపు 177, 4 వేల లోపు 212, 5 వేలలోపు 237 మంది ర్యాంకులు సాధించారని పేర్కొంటూ వారిని అభినందించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సీఈవో నల్లూరి జయప్రకాష్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పవిత్ర హృదయంతో ఉండండి


మాట్లాడుతున్న రెవరెండ్ విజయ్‌కుమార్

**ఒంగోలు రూరల్:** దేవుని బిడ్డలందరూ ఐక్యంగా ఉండాలని, కోపాలు, క్రోధాలు విడనాడి పవిత్ర హృదయంతో మసలుకోవాలని వైజాగ్‌కు చెందిన రెవరెండ్ విజయ్‌కుమార్ కోరారు. మండలంలోని దేవరంపాడు, కరవది గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రైస్తవ సమావేశాల్లో ఆయన ప్రసంగించారు. దేవుని ప్రేమ కలిగి ఉండాలని, అప్పుడే ఆయన వారసులము అవుతామని అన్నారు. ఐదు రొట్టెలు, ఐదు చేపలతో ఐదు వేలమందికి భోజనాలు ఏర్పాటు చేసిన ఏసుక్రీస్తు.. ప్రేమతత్వాన్ని, సహోదరుల మధ్య ఐకమత్యాన్ని కలిగి ఉండాలని కోరుకున్నాడని ఆయన అన్నారు. నేటి కాలంలో కుటుంబాల్లో శాంతి లేదని, భార్యాభర్తల మధ్య కోపాలు, అన్నదమ్ముల మధ్య క్రోధాలు, తల్లిదండ్రుల పట్ల ప్రేమ రహిత జీవితం కలిగి ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటివి తొలగించుకుని ప్రార్థనా మందిరాలకు వస్తేనే దేవుని ప్రేమ వారిపై కుమ్మరింపబడుతుందని అన్నారు. హృదయ శుద్ధి లేకుండా అలవాటు ప్రార్థనలు, అలవాటుగా చర్చిలకు పోవటాలు, చర్చిలో ఒకరినొకరు పలకరించే స్థాయి లేకపోవడం చాలా బాధాకరమని అన్నారు. అలాంటి వారంతా మారాలని, లేనిపక్షంలో నరకంలో పడేందుకు అర్హులవుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రారంభ ప్రార్థనలను జి.బేబీస్టార్ చేయగా, పాస్టర్ విక్టర్‌పాల్, అంచల శేఖర్ పర్యవేక్షించారు.

# అల్లూరి పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో కోటసత్యమాంబదేవి


ప్రత్యేక అలంకారంలో పోలేరమ్మ అమ్మవారు

**మార్కాపురం టౌన్:** మార్కాపురం పట్టణ శివారులోని అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వెంకటేశ్వర్లు అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు చేసి కుంకుమార్చన, అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ పరిధిలో ఉన్న నాగమయ్య శిలలు, పుట్ట వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, చైర్మన్ దాసరి వెంకటేశ్వర్లు, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

**కోటసత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు**

**బేస్తవారిపేట:** మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారికి సహస్ర నామ, కుంకుమార్చన, అభిషేకాలు చేశారు. పలు గ్రామాల నుంచి భక్తులు కుంకుమ బండ్లతో ఊరేగింపుగా ఆలయం వద్దకు తరలివెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

# వైభవంగా చెన్నకేశవుని రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న మహిళలు


ఉత్సవంలో చెన్నకేశవస్వామి

**కొనకనమిట్ల:** మండలంలోని పెదారికట్ల గ్రామంలో శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి, పార్వతి సమేత రాజనగరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం చెన్నకేశవుని రథోత్సవం భక్తుల జయజయధ్వానాల మధ్య వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణ మధ్య మంగళ వాయిద్యాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన రథంలో శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి విగ్రహాలను ఉంచి గ్రామంలో ఉత్సవం నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని రథాన్ని లాగి భక్తిని చాటుకున్నారు. రథోత్సవ కార్యక్రమానికి ఉభయదాతలుగా గౌండ్ల కుటుంబాలకు చెందిన దంపతులు వ్యవహరించారు. వేదపండితులు నంద్యాల వెంకటకృష్ణకిరన్, నుదురుపాటి వెంకటకృష్ణారావు స్వామివారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. బంధుమిత్రుల రాకతో గ్రామంలో సందడి నెలకొంది. సోమవారం వసంతోత్సవం, మంగళవారం ఏకాంతసేవ కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయిని దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు.

## కొనకనమిట్లలో చిరుజల్లులు

**కొనకనమిట్ల:** వాతావరణం ప్రభావంతో రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమై చిరు జల్లులు కురుస్తున్నాయి. ఆదివారం సాయంత్రం చినారికట్ల జంక్షన్, బచ్చలకూరపాడు, పాతపాడు గ్రామాల్లో కొద్దిపాటి వర్షం కురిసింది. ఇప్పటి వరకు కురిసిన వర్షంతో పొలాలు పదునెక్కడంతోపాటు పశుగ్రాసం సమస్య కొంత మేర తీరుతుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## మార్కాపురంలో కోతులు, కుక్కల బెడద


మార్కాపురంలోని ఓ బజారులో శునకాలు

**మార్కాపురం:** మార్కాపురం పట్టణంతోపాటు పలు గ్రామాల్లో వీధి కుక్కలు, కోతులు గుంపులు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. స్థానిక పూలసుబ్బయ్య కాలనీ, వడ్డెబజారు, ఎస్సీ బీసీ కాలనీ, విజయ టాకీస్ ఏరియా, జవహార్‌నగర్ కాలనీ, కొండారెడ్డి కాలనీ, గాంధీ బజారు, మెయిన్‌బజారు, శ్రీనివాస థియేటర్ ఏరియా, బ్రహ్మంగారి మఠం బజారు, వేములకోట, దరిమడుగు, చింతగుంట, నికరంపల్లి, బోడపాడు, రాయవరం, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో పలువురు కుక్కలు, కోతుల దాడిలో గాయపడ్డారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పట్టుకొచ్చిన కోతులను మార్కాపురం ప్రాంతంలో వదిలిపెట్టడంతో కోతుల బెడద ఎక్కువైందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మున్సిపల్ శానిటేషన్ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# జిల్లాలో అన్ని స్థానాలు వైఎస్సార్ సీపీవే

- రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ షంషీర్ అలీబేగ్


షంషీర్ అలీబేగ్

**మార్కాపురం:** అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లాలోని అన్ని స్థానాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు గెలవబోతున్నారని ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్ అలీబేగ్ అన్నారు. ఆదివారం ఆయన మార్కాపురంలో మీడియాతో మాట్లాడారు. జిల్లాలో ఉన్న మైనారీలు వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపు కోసం కష్టపడ్డారని, తమ ఓట్లు మేలు చేసిన జగన్‌కు వేశారన్నారు. ఒంగోలు పార్లమెంట్ స్థానంతో పాటు మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, దర్శి, కనిగిరి, కొండపి, ఒంగోలు అసెంబ్లీ స్థానాల్లో కూడా వైఎస్సార్ సీపీ అభ్యర్థులు మంచి మెజార్టీతో గెలుస్తారన్నారు. 58 నెలల జగనన్న పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎటువంటి రికమెండేషన్ లేకుండా నవరత్నాలతో పాటు ఇతర సంక్షేమ పథకాలు అందాయన్నారు. గ్రామాల్లో నాడు-నేడు ద్వారా పాఠశాలలు, వైద్యశాలలో జరిగిన అభివృద్ధి కళ్లెదుటే కనిపించటంతో ప్రజలు పోలింగ్ రోజున కేంద్రాలకు వచ్చి తమ ఓటు వేశారన్నారు. దీంతో వైఎస్సార్ సీపీ తరపున పోటీ చేసిన అభ్యర్థులకు మంచి మెజార్టీ వస్తుందన్నారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మద్దతు ఇచ్చిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.